ప్రజాశక్తి

ఆదివారం 9 జూన్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

చంద్రబాబు ప్రమాణ స్వీకార సభకు

ముమ్మర ఏర్పాట్లు

పరిశీలించిన కలెక్టర్లు, ముఖ్య అధికారులు

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రద్యుమ్న తదితరులు

ప్రజాశక్తి - గన్నవరం : ఈనెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో కేసరపల్లిలో బహిరంగ సభ ఏర్పాట్లను శనివారం కష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లు డి.కె.బాలాజీ, ఎస్.డిల్లీరావు, ఆర్అండ్‌బి శాఖ ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న, అడిషనల్ డైరెక్టర్ జనరల్ (శాంతి భద్రతలు) బాగ్చి, ఐజిలు రాజశేఖర్ బాబు, అశోక్ కుమార్, ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ పిహెచ్.డి.రామకష్ణ, కృష్ణాజిల్లా ఎస్‌పి నయీం తదితరులు పరిశీలించారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలోని ఐటి పార్క్ మేధా టవర్స్ సమీపంలో బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సభాస్థలిని, పార్కింగ్ ప్రదేశాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి, కష్ణా, ఎన్‌టిఆర్ జిఆల్లల సంయుక్త కలెక్టర్లు గీతాంజలి శర్మ, పి.సంపత్ కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డిఐజి గోపీనాథ్ జెట్టి, విజయవాడ డిసిపి అధిరాజ ఎస్.రాణా, గుడివాడ ఆర్‌డిఒ పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి దాడులపై హైకోర్టుకెళతాం

మాజీ మంత్రులు కొడాలి, పేర్ని

వార్త మెయిన్‌లో

గుదిబండగా సిసిఆర్‌సి యాక్ట్

- నామమాత్రంగానే కౌలు రైతులకు పంట రుణాలు
- భూ యజమాని ఆమోదం తప్పనిసరి
- నూతన ప్రభుత్వంపై ఆశలు!

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం తీసుకు వచ్చిన 2019 క్రాప్ కల్టివేషన్ రైట్స్ యాక్టు కౌలు రైతులకు సమస్యగా మారింది. భూ యజమానుల ఆమోదం ఉంటేనే సాగు ధృవీకరణ హక్కు పత్రాలు మంజూరు చేస్తామనే నిబంధన వీరికి శాపంగా మారింది. దీంతో జిల్లాలో వ్యవసాయ భూమిలో 70 శాతానికిపైగా పంటలు పండిస్తున్న కౌలు రైతులకు పంటల పెట్టుబడికి కనీస రుణాలు మంజూరుకాని పరిస్థితి నెలకొంది. అంతేగాక అధిక వడ్డీలకు ప్రైవేటు అప్పులు తీసుకుని నష్టపోవాల్సి వస్తోంది. నూతనంగా ఏర్పాటయ్యే ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరిస్తుందన్న ఆశతో కౌలు రైతులు వేచిచూస్తున్నారు.

కృష్ణాజిల్లాలో 4 లక్షల 27 వేల 293 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల ఖరీఫ్ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనాగా ఉంది. దీనిలో 70 శాతం విస్తీర్ణంలో 2.25 లక్షల మంది కౌలు రైతులు పంటలు సాగు చేస్తున్నారు. అయితే వ్యవసాయంలో పంటల పెట్టుబడులు గణనీయంగా పెరిగిపోవడంతో రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరి

సాగు చేయాలన్నా ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. పసుపు, కంద, అరటి తదితర రకాల ఉద్యాన పంటలు సాగు చేయాలంటే లక్ష రూపాయలకుపైగా పెట్టుబడి అవసరం అవుతోంది. అయితే ఈ పంట పెట్టుబడిని సమకూర్చుకోవడం కౌలు రైతులకు భారంగా మారింది. అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగుచేస్తున్న వీరికి నామమాత్రంగానే పంట రుణాలు అందుతున్నాయి. 2023-24 ఖరీఫ్ సీజన్లో జిల్లాలోని రైతులకు పంటల పెట్టుబడి నిమిత్తం బ్యాంకులు రూ.2,994 కోట్ల మేర రుణాలను

(మిగతా 2లో)

కేంద్ర మంత్రివర్గంలో బాలశౌరి ?

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కేంద్ర మంత్రివర్గంలో జనసేన నుంచి మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి చోటు దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది. జనసేనాని పవన్ కళ్యాణ్ ఆయనను కేంద్ర మంత్రివర్గంలోకి పంపే అవకాశం ఉందని తెలిసింది. బాలశౌరికి ఎంపీగా మూడుసార్లు గెలుపొందిన అనుభవం, కేంద్రంలో మంచి పరిచయాలు ఉండటంతో పవన్...బాలశౌరివైపే మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బాలశౌరి 2005లో తెనాలి ఎంపీగా, 2019, 2024ల్లో మచిలీపట్నం ఎంపిగా గెలుపొందారు.

రామోజీరావు మృతితో

పెదపారుపూడిలో విషాద ఛాయలు

పెదపారుపూడి గ్రామంలో రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామ ప్రముఖులు

ప్రజాశక్తి - పెదపారుపూడి : ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు శనివారం తెల్లవారుజామున కన్నుమూయడంతో ఆయన స్వగ్రామం కృష్ణాజిల్లా పెదపారుపూడిలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో పలువురు ప్రముఖులు రామోజీరావు సేవలను, గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను గుర్తుచేసుకున్నారు. 1936 నవంబరు 16న రైతుకుటుంబంలో జన్మించిన రామోజీరావు 2014లో పెదపారుపూడి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపియుపి పాఠశాల భవనాలను నిర్మించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేయించారు. గ్రామంలో చెరువు గట్టు ఫినిషింగ్, ఆర్ అండ్ బి రహదారి నుండి బిసి హాస్టల్ వరకు సిసి రోడ్డును నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా పూల మొక్కలను నాటించారు. హిందూ, క్రైస్తవ శ్మశాన వాటికలను అభివృద్ధి చేశారు. కో ఆపరేటివ్ బ్యాంక్, పశు వైద్యశాల భవనాలను నిర్మించారు. వాటర్ ప్లాంట్‌ను అభివద్ధి చేశారు.

కుటుంబ నేపథ్యం.

రామోజీరావు తల్లిదండ్రులు వెంకట సుబ్బమ్మ, వెంకట సుబ్బారావు. ఆయన పూర్వీకులు పామర్రు మండలం పెరిశేపల్లి గ్రామానికి చెందినవారు. ఆయన తాత రామయ్య కుటుంబంతో పెరిశేపల్లి నుంచి పెదపారుపూడికి వలస వచ్చారు. రామోజీరావు 1947లో గుడివాడలో పురపాలకోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుకున్నారు. 1957లో ఆరో ఫారంను అక్కడే పూర్తిచేసుకుని, గుడివాడ కళాశాలలో ఇంటర్, బిఎస్‌సి విద్యనభ్యసించారు. ఆయనకు 1961 ఆగస్టు 19న పెనమలూరుకు చెందిన తాతినేని వెంకట సుబ్బయ్య, వాణీదేవిల రెండో కుమార్తె రమాదేవితో వివాహమైంది.

పలువురు ఘన నివాళి

పెదపారుపూడిలోని రామాలయం వద్ద రామోజీరావు చిత్రపటానికి పలువురు

(మిగతా 2లో)

శ్రద్ధాంజలి

జననం : 12-12-1958

మరణం : 02-06-2024

శ్రీమతి రావూరి కనక విజయలక్ష్మి అజయ్ గారు

మా హృదయఫలకాలపై చెక్కిన సజీవ శిల్పం నీ రూపం, మా జీవన జ్యోతిగా నీవు చూపిన ప్రేమ అజరామరం.
కుటుంబ శ్రేయస్సునే గాక అభ్యుదయ భావాలు కలిగి సమాజ శ్రేయస్సుకు కూడా నీ వంతు సహకారం
అందించి, అందరి మన్ననలు పొందావు. మీ ఆశయాలను, విలువలను కొనసాగిస్తామని,
మీ అకాల మరణానికి చింతిస్తూ... జోహార్లు అర్పిస్తున్నాం...

ఇట్లు : కుటుంబ సభ్యులు

సంస్మరణ : ది. 09-06-2024న మొవ్వ మండలం, చినముత్తేవి గ్రామంలోని మా స్వగృహమునందు జరుగును.

మొదటిపేజీ తరువాయి

రామోజీరావు మృతితో పెదపారుపూడిలో విషాద ఛాయలు

పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా మాట్లాడుతూ తమ గ్రామాన్ని రామోజీ రావు దత్తత తీసుకుని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఇంటింటికీ కుళాయి, మరుగుదొడ్ల, సిసి రోడ్లు, వీధిలైట్లు, వాటర్ ప్లాంట్ అభివృద్ధి, పలు భవనాల నిర్మాణం వంటి అనేక అభివద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. రామోజీరావును కోల్పోటం బాధాకరమన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ గారపాటి నాగబాబురావు, పాలడుగుల రాణి, నిమ్మగడ్డ సుభద్ర, పార్వతి, శ్రీను, నత్త వాణి, పాలడుగుల చంద్రశేఖర్, మేడేపల్లి రవి, కన్నా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ డిల్లీరావు సంతాపం

రామోజీరావు మృతికి పాత్రికేయ రంగానికి పూడ్చలేని నష్టమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తన వినూత్న ఆలోచనలతో విభిన్న రంగాల్లో ఆయన తన ప్రతిభను నిరూపించుకున్నారని కొనియాడారు.

మాజీ మంత్రి వెలంపల్లి సంతాపం

ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మతి పట్ల మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. తెలియజేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఎన్నో ప్రమాణాలు నెలకొల్పారని, పత్రిక, సినీ, వ్యాపార రంగాలపై చెరగని ముద్ర వేశారని కొనియాడారు. తెలుగు భాష సంస్కృతులకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సంతాపం

రామోజీరావు మృతికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.వెంకటప్పయ్య, వై.శ్రీనివాస్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను సానుభూతి వ్యక్తం చేశారు. జర్నలిజానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. రామోజీరావు మతి పత్రికా రంగానికి తీరనిలోటని సీనియర్ జర్నలిస్ట్, ఉమ్మడి రాష్ట్ర ప్రెస్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు నిమ్మరాజు చలపతిరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

గుదిబండగా సిసిఆర్‌సి యాక్ట్

మంజూరు చేశాయి. అయితే వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల్లో నాలుగో వంతు మంది అంటే 52 వేల మందికి మాత్రమే సాగు ధృవీకరణ హక్కు పత్రాలు (సిసిఆర్‌సి) అందడంతో చాలా మంది కౌలు రైతులకు రుణాలకు నోచుకోవడంలేదు. అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులకు కేవలం రూ.60 కోట్లు మాత్రమే పంట రుణాలుగా అందాయి. దీంతో అత్యధిక సంఖ్యలోని కౌలు రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని పంటల పెట్టుబడి సమకూర్చుకోవాల్సి వచ్చింది. బ్యాంకులు నూటికి 50 పైసలకు రుణాలు ఇస్తుంటే, ప్రైవేటు వ్యాపారులు రూ.2 నుంచి రూ.4 వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కౌలు రైతుల రెక్కల కష్టం సైతం వడ్డీ వ్యాపారుల చేతిలోకి వెళ్లిపోతోంది.

కౌలు రైతుకు సమస్యగా మారిన 2019 చట్టం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సర్టిఫికేషన్ ఆఫ్ కల్టివేషన్‌ను (సాగు ధ్రువీకరణ పత్రాలు, సివోసిలను) అధికారులు మంజూరు చేశారు. వాస్తవ సాగుదారులను గుర్తించి అధికారులు సివోసిలను కౌలు రైతులకు మంజూరు చేసేవారు. వీటి ఆధారంగానే తక్కువ వడ్డీలకు బ్యాంకుల ద్వారా ఎక్కువ మంది కౌలు రైతులు రుణాలను తీసుకునే వారు. అప్పట్లో జిల్లాలోని కౌలు రైతులకు రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్లు రుణ ప్రణాళికలో 10 శాతం బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో సిసిఆర్‌సి చట్టాన్ని తీసుకు వచ్చింది. ఈ చట్టం ప్రకారం భూ యజమాని ఆమోదం ఉంటేనే కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయాల్సి ఉంది. దీంతో సివోసిలు తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో కౌలు రైతులు రాష్ట్రంలో ఏర్పాటయ్యే నూతన ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. తమకు ప్రయోజనం కలిగే నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నారు.

నగరంలో తిష్టవేసిన సమస్యలను పరిష్కరించండి

వీఎంసి కమిషనర్‌కు ఎంఎల్‌ఎ గద్దె, టిడిపి కార్పొరేటర్ల వినతి

నగర కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే గద్దె, పక్కన కార్పొరేటర్లు

ప్రజాశక్తి-విజయవాడ

తూర్పు నియోజకవర్గంలో తిష్టవేసిన సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ గద్దె రామమోహన్‌రావు... నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. తూర్పు నియోజకవర్గంలోని టిడిపి కార్పొరేటర్లతో కలిసి ఎంఎల్‌ఎ గద్దె... నగర కమిషనర్‌ను వీఎంసిలోని ఆయన ఛాంబర్లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో రక్షిత మంచినీరు సరఫరా జరగడంలేదన్నారు. ఇటీవల మొగల్రాజపురంలో కలుషిత నీరు తాగి అతిసార బారిన పడి పలువురు ఆస్పత్రుల పాలయ్యారని గుర్తుచేశారు. పలువురు మృతి చెందారని తెలిపారు. కృష్ణలంక, రాణిగారితోట, రామలింగేశ్వర్‌నగర్, పటమట తదితర ప్రాంతాల్లో పైపుల ద్వారా మురుగునీరు సరఫరా అవుతోందన్నారు. డ్రైన్లలో షిల్టును తొలగించి, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. ఆగిపోయిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజ పనులకు ప్రభుత్వం నుండి నిధులను మంజూరు చేయించాలని కోరారు. 4వ డివిజన్ శ్రీనగర్ కాలనీ వివేకానంద రోడ్డు, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని వేములపల్లి పరమేశ్వరరావు రోడ్డు, భారతి నగర్ ఆవర రోడ్డు, సిమెంట్‌రోడ్లుగా నిర్మించాలని ఎంఎల్‌ఎ కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ వెంటనే పెండింగ్ పనులను ప్రారంభించడంతో పాటు రక్షిత మంచినీటి సరఫరాలో ఎటువంటి లోపం లేకుండా చూస్తామని హామీనిచ్చినట్లు కార్పొరేటర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, క్రాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పార్కులు, వెహికల్ డిపో కార్మికులకు

రూ.21 వేల వేతనం ఇవ్వాలి

వీఎంసికి కమిషనర్‌కు యూనియన్ నేతల వినతి

ప్రజాశక్తి - విజయవాడ

గత సమ్మెకాలంలో ఇచ్చిన హామీ మేరకు పార్కుల్లో, వెహికల్ డిపోలో పని చేస్తున్న కార్మికులు, మెకానిక్‌లకు రూ.21 వేల వేతనం ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఏపి మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు కోరారు. కమిషనర్‌ను శనివారం ఆయన ఛాంబర్లో యూనియన్ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఇవే సమస్యలను చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ దృష్టికి కూడా నాయకులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ గత జనవరిలో మునిసిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేసిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. అలాగే వారాల తరబడి సమ్మెలో ఉన్న 250 మంది క్లాప్ ఆటో డ్రైవర్ల వేతన సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. క్లాప్ ఆటోలు రన్నింగ్‌లో లేనందున వీధుల్లో చెత్త తరలింపు సమస్యగా మారిందని, పారిశుధ్యం అధ్వానంగా తయారైందని పేర్కొన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ తన పరిధిలో ఉన్న వేతనాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబసు, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.ప్రవీణ్, నాయకులు స్టీఫెన్‌బాబు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ డిమాండ్

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్

విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం గ్రామంలో ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ పరిశీలించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. గత నెల కూలి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వం ప్రకటించిన రూ.300 చొప్పున కూలి రావడంలేదని కార్మికులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి కూలి రూ.300 చెల్లించాలని, బకాయిలు వచ్చేవిధంగా చూడాలని, వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో మాతంగి ఆంజనేయులు, సత్తు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న కోట కళ్యాణ్

నీట్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

నీట్ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ, మార్కుల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని ది పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నరహరి శిఖరం, జి.ఈశ్వరయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నీట్ పరీక్షను రద్దు చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఎప్పుడూ లేని విధంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్, ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన విద్యార్థుల్లో 8 మందికి ఫస్ట్ ర్యాంకు రావడంపై విచారణ జరపాలని కోరారు.

రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ పదవికి విష్ణు రాజీనామా

ప్రజాశక్తి - విజయవాడ

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని మీడియాకు విడుదల చేశారు.

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా జడ్జిగారి కోర్టు, మచిలీపట్నం
డి.ఓ.పి. నెం. 128/23

బిట్వీన్
దావు నాగరాజు .... పిటీషనర్
మరియు
దావు కళ్యాణి @ చీకటి కళ్యాణి ... రెస్పాండెంట్
ప్రతివాది అడ్రస్ :
దావు కళ్యాణి @ చీకటి కళ్యాణి భర్త : దావు నాగరాజు, తండ్రి : చీకటి బాల వెంకట సుబ్బయ్య, R/o సుందరయ్యనగర్, పాయకాపురం, విజయవాడ.

పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్ తరపు నోటీసు నిమిత్తం ది. 27-6-2024కి వాయిదా అయిపున్నది. కావున రెస్పాండెంట్ పైన తెలిపిన తేదీ నాటికి పై కోర్టుకి ఉదయం 10-30 గం.లకు వ్యక్తిగతంగా గానీ, లేదా ప్లీడరుగారి ద్వారా గానీ హాజరయి అక్షేపణలు వున్న యెడల తెలుపగలరు. లేదో శ్రీ కోర్టువారు పరోక్షంగా నిర్ణయం తీసుకొనబడును.
వాయిదా : 27-6-2024
మచిలీపట్నం
ది.8-5-2024

ఇట్లు
శ్రీ గుమ్మడి సుబ్బారావు
అడ్వకేట్, మచిలీపట్నం.
సెల్ : 92968 56254.

IN THE COURT OF THE VII Addl. DISTRICT JUDGE AT VIJAYAWADA
IA No. 1014/2023 in OS No. 22/2016
Between:
Josyula Vijaya Durga ......petitioner/plaitif
And
Bethapudi Koteswara Roa (Died)
Bethapudi Sarabhaiah and others
....Respondents/defendants
NOTICE
To
R 5. Vatri Vijaya w/o Narasimha Rao Age about 52yrs, House wife
R 6. Chodavarapu Krishna Kumari w/o Diwakar Age about 56 yrs Housewife Both residents of D.No. 24-18-9 Durgapuram Vijayawada-520008

పై నంబరు పెటిషన్లో 5వ మరియు 6 వ రెస్పాండెంట్స్ నోటీసు నిమిత్తం సబ్సిట్యూషన్ సర్వీస్ ద్వారా 24-06-2024 వాయిదా వేసివున్నారు. పై తేదీన న 5వ మరియు 6 వ రెస్పాండెంట్స్ వాయిదా తేదీన 24-06-2024 ఉదయం 10:30 సదరు పైన పేర్కొనబడిన కోర్టు యందు హాజరు కానీ యెడల పరోక్షముగా తీర్మానించబడును.
(By the order of the Hon□ble court)
వాయిదా తేదీ 24-06-2024
సమయం: 10:30 గం॥

G. Ravindra Prasad
G.V Raghupathi
Advocates
Dno :59A-7-22, 2nd floor, flat no 10, Sree Nilayam, SBH colony, Gurunanak Nagar Colony Road. Vijayawada - 08

రామోజీరావు మృతికి పలువురు సంతాపం

మచిలీపట్నంలో..



అవనిగడ్డలో...

పమిడిముక్కలలో..

గన్నవరంలో...

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఈనాడు సంస్థల అధినేతగా అనేక రంగాల్లోనూ తెలుగు సమాజాన్ని నిలబెట్టిన వ్యక్తి రామోజీరావు అని మచిలీపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు కొల్లు రవీంద్ర అన్నారు. రామోజీరావు మతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన సంతాపం తెలియజేశారు.పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామోజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ కష్ణాజిల్లా పెదపారుపూడిలో సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన అసమాన్యంగా పత్రికా రంగంలో తెలుగు భాషకు సేవ చేశారని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో జన సేన నియోజక వర్గ ఇంఛార్జి బండి రామకష్ణ,మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం వి.బాబా ప్రసాద్,పలువురు టిడిపి కార్పొరేటర్లు, పాల్గొన్నారు.అలాగే రామోజీరావు అస్తమయంపై కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రామోజీరావు మరణం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని నారాయణరావు అన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** అక్షర శిల్పి ఈనాడు రామోజీరావు మతి బాధాకరమని ఆయన మతి దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామోజీరావు మతికి గుడివాడ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ తరఫున ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయంకషితో కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తి రామోజీరావు అన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** రామోజీరావు మరణం జర్నలిజం, చిత్రపరిశ్రమ రంగాలకు తీరనిలోటు అని రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి కొసరాజు నాగ సాయిరాం అన్నారు. గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి, ఐదు నిముషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. గన్నవరం నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు జాస్తి తాతారావు, గన్నవరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ, బోడపాటి రవికుమార్, మేడేపల్లి రమ, కాట్రగడ్డ అరుణ, మన్నెం శ్రీనివాసరావు, తాటిపాముల నాగయ్య, జాస్తి మురళి, నెలకుదిటి లావణ్య పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** రామోజీరావు మరణం బాధాకరమని పమిడిముక్కల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని వీరంకిలాగు పార్టీ కార్యాలయం వద్ద రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యమునా బత్తుల వెంకటేశ్వరరావు, మర్రివాడ గ్రామ సర్పంచ్ ఒంపు కడవల ఫ్రాన్సిస్, నాదెండ్ల సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, ఆముదాలపల్లి గోపాలకష్ణ, కత్తిగా నాగేశ్వరరావు, పరస సిల్వి బాబు, గురువేంజపల్లి శీను తదితరులు పాల్గొన్నారు .**ప్రజాశక్తి-మోపిదేవి :** రామోజీరావు మరణం పత్రిక రంగానికి తీరని లోటు అని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. శనివారం మోపిదేవి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు మేడబలిమి మల్లికార్జునరావు, మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్దన్ రావు, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు నాదెళ్ల శర చంద్ర బాబు, పరుచూరి శ్రీనివాసరావు, వేములపల్లి వెంకటరామయ్య, డోకిపర్తి బాలకోటేశ్వ రరావు, నాగినేని శేషగిరిరావు, మీసాల శివరాం, ఉప్పాల ఏడుకొండలు, నాగార్జున,తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** నిత్యం పనిచేయడం ద్వారానే తనకు విశ్రాంతి ఉంటుందనే సిద్ధాంతంతో అహర్నిశలు శ్రమిస్తూ అత్యున్నత స్థానాలను అధిరోహించిన వ్యక్తి రామోజీరావు అని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు అన్నారు. చల్లపల్లి తన స్వగృహంలో రామోజీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** ఈనాడు పత్రిక అధినేత రామోజీరావు మరణంతో తెలుగుజాతి ఒక మహోన్నత వ్యక్తిని కోల్పోయిందని, అది తెలుగుజాతికి తీరని లోటు అని అవనిగడ్డ జనసేన పార్టీ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ నివాళులర్పించారు. శనివారం వద్ద ప్రసాద్ స్వగృహం వద్ద రామోజీరావు చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మండలి వెంకట్ రామ్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, కర్ర సుధాకర్, మాచవరపు ఆదినారాయణ, కంచర్ల ఆనంద్, జనసేన పార్టీ నాయకులు గుడివాక శివరావు పాల్గొన్నారు.



కాగిత కృష్ణప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి పెడన : పెడన శాసనసభ్యుడిగా ఎన్నికైన కాగిత కృష్ణ ప్రసాద్‌ను మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం(హన్ను) మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా కష్ణ ప్రసాద్ మున్సిపాలిటీలోని జరిగే అభివద్ధి పనులను అలాగే పలు రకాల కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు ప్రసాద్ జితేంద్ర, సులేమాన్ దాదా తదితరులు కలిసిన వారిలో ఉన్నారు. స్థానిక తొమ్మిదవ వార్డులోని తోటముల సెంటర్లో ఉన్న శ్రీ అభయ ఆంజనేయఆలయం వద్ద జయంతిని పురస్కరించుకుని భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు.

బుద్ధప్రసాద్‌కు పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయ సాధించిన మండలి బుద్ధ ప్రసాద్ ను యుటిఎఫ్ నాయకులు శనివారం ఆయన స్వగృహం వద్ద కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి కనకారావు ఆధ్వర్యంలో బుద్ధ ప్రసాద్కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కనకారావు నూతన ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆకాంక్షలు నెరవేర్చాలని కోరారు. గత ప్రభుత్వ కాలంలో అనేక నిర్బంధాలు ఎదుర్కొన్నామని మానసికంగా నలిగిపోయమన్నారు. నాటి ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ ప్రకారమే సిపిఎస్ రద్దు చేయాలని, జీవో నెంబర్ 117 రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని అన్నారు. పిఆర్సి బకాయిలు డి ఎ ఎరియర్స్ పిఎఫ్ కోసం తాము పోరాడితే వైసీపీ ప్రభుత్వం పరిష్కారం చేయకుండా కాలయాపన చేయడంతో పాటు తమను అరెస్టులతో వేధించారన్నారు. రానున్న ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని బుద్ధ ప్రసాద్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శిలు బీజీ గోపాలకష్ణ, ఎన్ వెంకటేశ్వరరావు, ఎల్ సుభాషినిలతోపాటు ఏడు మండలాలకు చెందిన మండల అధ్యక్ష కార్యదర్శులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.అలాగే ఎంఎల్ఏగా విజయం సాధించిన మండలి బుద్ధ ప్రసాద్ ను పలువురు అధికార రాజకీయ పార్టీలకు చెందిన వారు కలసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారిని తహేర సుల్తానా బుద్ధ ప్రసాద్ స్వగహానికి వచ్చి ఆయనను పూలదండలు శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే విజయవాడకు చెందిన రాధా రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు కూడా బుద్ధ ప్రసాద్ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం అవనిగడ్డకు విచ్చేసిన ఆయన జనసేన నాయకులతో కలిసి బుద్ధ ప్రసాద్ స్వగహానికి వెళ్లి ఆయ నను సత్కరించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబుతోపాటు రాధారంగమిత్ర మండల సభ్యులు పాల్గొన్నారు.

బుద్ధ ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణా స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు : ఎపిఎస్ఆర్‌టిసి గుంటూరు -2 డిపోలో లైట్ మోటార్ వెహికిల్ లైసెన్స్ కలిగిన వారికి హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణ స్కూల్ ప్రారంభించినట్లు డిపో మేనేజర్ యస్‌కె అబ్దుల్ సలామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకూ 14 బ్యాచ్‌లకు శిక్షణిచ్చామని, ప్రస్తుతం 15వ బ్యాచ్ కొరకు అడ్మిషన్లు ప్రారంభించామని తెలిపారు. ఒక్కొక్క బ్యాచ్‌కి 16 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని, శిక్షణకు పేర్లు త్వరగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ డ్రైవింగ్ స్కూల్లో ప్రతిరోజూ ఒక గంటపాటు వాహనం యొక్క వివిధ భాగాల గురించి, వాటి పనితీరు గురించి, వివిధ రకాల రోడ్ల గురించి, రోడ్లపైన ఉండే పెయింటింగ్ మార్కుల గురించి, రోడ్ల ప్రక్కన ఉండే సైన్ బోర్డుల గురించి, రోడ్ల పక్కన ఉండే సిగ్నల్ బోర్డుల గురించి, సవివరంగా తెలియజేస్తారని పేర్కొన్నారు. ప్రతిరోజూ ప్రాక్టికల్‌గా ప్రతి ఒక్కరితో 15 కిలోమీటర్లు బస్సును నడిపిస్తామని, వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాలు జరిగే తీరు చూయించి, వాటి నివారణపై వివరిస్తామని తెలిపారు. ఘాట్ రోడ్డులో ఎటువంటి భయమూ లేకుండా వాహనం నడపటానికి కొండవీడు ఘాట్ రోడ్డులో, కోటప్పకొండ ఘాట్ రోడ్డులో వారిచేత స్వయంగా నడిపిస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయ్యాక ఫారం-5, ఫారం-5ఎ సర్టిఫికెట్స్ జారీ చేస్తామని, తద్వారా అభ్యర్థి ఆర్‌టిఎ నిర్వహించే టెస్ట్‌లో పాల్గొని లైసెన్స్ పొందవచ్చని వివరించారు. ఇతర వివరాల కోసం 8897371003, 7382894585 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రమాణ స్వీకారానికి కట్టుదిట్టంగా ఏర్పాట్లు

- రాష్ట్ర రవాణా, రహదారులు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టాలని రాష్ట్ర రవాణా రహదారులు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర అదనపు డీజీ ఎస్. బాగ్చి, ఐ.జీ.లు రాజశేఖర్‌బాబు, అశోక్ కుమార్, పోలీస్ కమిషనర్ రామకష్ణ, కష్ణ, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు డీ.కే. బాలాజీ, ఢిల్లీరావు, జిల్లా పోలీసు అధికారి అద్నాన్ నయీం అస్మిలతో కలిసి ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో నిర్వహణ కోసం గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని ఐటి పార్కు మేధ టవర్స్ సమీపంలో గల స్థలాన్ని ఎంపిక చేసామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తోపాటు పలువురు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, శాసనసభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు విచ్చేయనున్నారన్నారు. ఇందుకోసం ప్రధాన సభ ప్రాంగణాన్ని బాగా చదును చేసి ముళ్లపొదలను తొలగించే పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. అక్కడ వేదిక, బారికేడింగ్, బ్లాక్ ల విభజన, పారిశుధ్యము ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రముఖులకు వసతి, పాసులు ఏర్పాటు చేయాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. సభకు వచ్చే అతిథులకు, ప్రజలకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, ఆహారము ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖులకు, ప్రజలకు, మీడియా వారికి అవసరమైన సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంపిక చేసిన లేఅవుట్, గంగరాజు, విమానాశ్రయము, వెటర్నరీ కళాశాల, మేధా టవర్సు, పెట్రోల్ బంకు వద్ద గల పార్కింగ్ ప్రదేశాల నుండి ప్రధాన సభకు చేరుకునేందుకు వీలుగా అప్రోచ్ రహదారులను సజావుగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానమంత్రి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గన్నవరం విమానాశ్రయం నుండి ప్రధాన సభ వేదిక వద్దకు రాకపోకలు, గవర్నర్ రాకపోకల కాన్వాయ్కి ఎలాంటి అడ్డంకులు లేకుండా పకడ్బందీగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, కృష్ణ ఎన్టీఆర్ జిల్లాల సంయుక్త కలెక్టర్లు గీతాంజలి శర్మ, సంపత్ కుమార్, డిఐజి గోపీనాథ్ జెట్టి, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడుకర్, విజయవాడ డిసిపి అధిరాజ్ ఎస్. రానా, గన్నవరం విమానాశ్రయం డైరెక్టర్ ఎమ్మెల్కే రెడ్డి, గుడివాడ ఆర్డిఓ పి పద్మావతి, పలు శాఖాల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

రైతుబజార్ ప్రక్షాళన ఎప్పుడో !

ప్రజాశక్తి - నందిగామ :

నియోజకవర్గంలోని నందిగామ, చందర్లపాడు, జగ్గయ్యపేటలోని పలు గ్రామాలకు ఈ రైతుబజార్ సేవల్ అందిస్తుంది. ఐతే గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల రైతుబజార్‌పై పలు ఆరోపణలు నెలకొన్న విషయం తెలిసిందే! అరోపణలేకాదు వాస్తవం కూడా ఉండటం మూలంగా ఇప్పటికే పలు మీడియా సంస్థలు రైతుబజార్ నిర్వాకంపై ప్రశ్నించిన సందర్భాలు లేకపోలేదు. కానీ మార్పురాని అధికారుల చర్యల ద్వారా ఏమాత్రం రైతుబజార్ సేవలు మెరుగుపరచకపోగా అధికారులు, తక్కువ నాణ్యతతో పనిచేస్తూ ప్రజల సహనాన్ని పరిశీలిస్తున్నాయి.

ఇక్కడ లభించని కూరగాయలు సమీప మార్కెట్ నుండి అందించడం సహజం. అలాంటి వాటిలో ఉదాహరణకు బహిరంగ మార్కెట్లో హోల్‌సేల్‌గా సుమారు 30 కేజీల టొమాటో రూ.1500 నుండి రూ.900ల వరకు వివిధ ధరల్లో టమాటో లభిస్తుంది. ఐతే రైతుబజార్ లలో మాత్రం రవాణా కాంట్రాక్టర్ కమిషన్ కలిపి రూ.48 కి అందిస్తున్నారు. ఐతే మొదటిరకం లేక మధ్యస్థ రకం అందించాల్సిన కాంట్రాక్టర్లు అతితక్కువ నాణ్యత గల కురగాయలు అందిస్తూ వినియోగదారుల ఆరోగ్యాలను పణంగా పెట్టాల్సి వస్తోంది. ఐతే ఇక్కడ ప్రభుత్వంలో చిన్న లొసుగుల మూలంగా జరిగే కొన్ని అతిక్రమణలు, నందిగామ రైతుబజార్లో మొత్తం 100 కు పైగా స్టాళ్లు నిర్వహిస్తున్నారు.

మొత్తం షాప్‌లలో షుమారు 70 వరకు రైతుల ద్వారా నడుపుతున్నప్పటికి షుమారు 30కి పైగా షాపులను డ్వాక్రా మాటున ప్రైవేటు వ్యాపారులు నిర్వహిస్తున్నారు. గతంలో షాప్ నిర్వాహకులు అందరికీ గుర్తింపు కార్డులను ప్రభుత్వం మంజూరు చేసేది, ప్రస్తుతం గుర్తింపు కార్డు మంజూరు నిలిచిపోయింది. ఒక డ్వాక్రా గ్రూప్‌కి కేటాయించబడిన షాప్ ఆగ్రూప్ లోని ప్రథమ, ద్వితీయ లీడర్స్‌కు మాత్రమే గతంలో గుర్తింపు కార్డ్ ఇవ్వగా ప్రస్తుతం ఆ విధానం లేదు. గుర్తింపుకార్డులు లేకుండా అమ్మకాలు నిర్వహించే వ్యాపారులు తమ రాజకీయ పలుకుబడితో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతంలో లభ్యం కానీ కూరగాయలు ఇతర ప్రాంతాల నుండి తీసుకురావడానికి కొందరు వ్యక్తులను కాంట్రాక్టర్లు రూపంలో మార్కెట్ శాఖ నియమిస్తుంది. వీరి అత్యాశ కారణంగా బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు లభించిన వస్తువులు వివిధ రకాల చార్జెస్‌ను వాటికి కలిపి అమ్మడం పరిపాటి! ఐతే శాఖా పరమైన నిర్లయంతో అమ్మకాలు సాగినా వాటి నాణ్యత విషయంలో మాత్రం రాజీపడక తప్పని పరిస్థితి నెలకొంది. గత సంవత్సర కాలంగా రైతుబజార్ అమ్మకాల్లో నాణ్యతపై అనేకమార్లు పలు మీడియా సంస్థలు స్పందించినప్పటికి అధికారుల్లో మార్పు కలగడం లేదు. ఈ రైతుబజార్ల పై ఉన్నత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం విచిత్రం కాగా, స్థానిక అధికారులు అవైపు చూడరు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుబజార్ సేవలపై అధికారులు దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శిలాఫలకాల ధ్వంసం ఘటనలో 9 మంది అరెస్టు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణ పరిధిలో శుక్రవారం నాడు శిలాఫలకాలను ధ్వంసం చేసిన ఘటనలో నందిగామ పట్టణ టిడిపి అధ్యక్షుడుతో సహా మరో తొమ్మిదిని శనివారం అరెస్టు చేసినట్లు నందిగామ సిఐ హనిష్ తెలిపారు. శుక్రవారం టిడిపికి చెందిన పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో శిలాఫలకాలను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. అయితే అదే రోజు పట్టణ పార్టీ అధ్యక్షుడుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను టిడిపి నాయకులు కార్యకర్తలు పోలీసు స్టేషన్ నుంచి బలవంతంగా తీసుకోని పోయారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి 10 మంది వ్యక్తులను శనివారం నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని శనివారం సాయంత్రం పోలీసులు నందిగామ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి వీరికి బెయిల్ మంజూరు చేసినట్లు నందిగామ సిఐ హనీష్ తెలిపారు.

ఆధునిక వైద్యంతో గర్భస్రావాలను అరికట్టవచ్చు : డాక్టర్ హేమ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఆధునిక వైద్య ప్రగతితో కొంతవరకు రిపీటెడ్ గర్భస్రావాలను అరికట్టవచ్చని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ హేమ ప్రసన్న అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం పునరావృత గర్భస్రావాలు అనే అంశంపై ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న హేమ ప్రసన్న మాట్లాడుతూ కొందరు గర్భిణీలకు గర్భం వచ్చిన ప్రతిసారీ ఆరు నెలలలోపు గర్భస్రావాలు అయిపోతుంటాయని, ఇటువంటి గర్భస్రావాల విషయంలో ప్రతి మహిళకి అవగాహన అవసరం అన్నారు. అంతుపట్టకుండా మాటిమాటికీ గర్భస్రావం జరగడానికి 2 నుండి 5 శాతం కేసుల్లో జన్యుపరమైన దోషాలు కారణంకాగ, 10 నుండి 15 శాతం కేసుల్లో గర్భకోశం సహజరీతిలో ఉండకపోవడం మరొక కారణ:ం అన్నారు. మరో 20 శాతం మందిలో ఆటోఇమ్యూన్ డిసీజెస్ కారణం కాగా ఇంకో 5 శాతం కేసుల్లో గర్భిణీగా

మాట్లాడుతున్న హేమ

ఉండగా వచ్చే ఇన్‌ఫెక్షన్ కారణం అన్నారు. రీపీటెడ్‌గా అబార్షన్లు జరుగుతున్నపుడు జెనిటిక్ టెస్టులు, రక్తపరీక్షలు, స్కానింగ్‌లు అవసరం అన్నారు. ఆధునిక వైద్య ప్రగతితో కొంతరకు రిపీటెడ్ గర్భస్రావాలకు అరికట్టడం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ మారు అధ్యక్షత వహించగా స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల తరుపునే మా పోరాటం : మొండితోక

ప్రజాశక్తి - నందిగామ : ప్రజలతోనే.... మా ప్రయాణం... మళ్లీ ప్రజల తరపున పోరాడతామని నందిగామ మాజీ ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. శనివారం మాజీ ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్ రావు ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి... నూతన శాసనసభ్యులకు అభినందనలు తెలిపారు. 2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత ప్రజల తరపున పోరాటం చేశామన్నారు. 2019 ఎన్నికల్లో గెలిచి నందిగామ నియోజకవర్గం అభివద్ధికి తమ వంతు కషి చేశామన్నారు. నేడు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గత 3 రోజులుగా జరుగుతున్న దాడులను, ఉన్మాద చర్యలను ప్రతి ఒక్కరు గమనిస్తున్నారని తెలిపారు. నంది గామ నియోజక వర్గంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ధైర్యంగా ఉండాలని, టిడిపి చేస్తున్న దాడులు, దౌర్జన్యాలు ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా మారాయన్నారు.

దాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దుర్గగుడి ఇఓ రామారావు

ఆలయ స్వర్ణ తాపడం పనులకు విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి అనంతపురానికి చెందిన జ్వాలాపురం శ్రీకాంత్, కుటుంబ సభ్యులు రూ.1,20,000లను శ్రీ అమ్మవారి ఆలయం స్వర్ణ తాపడం పనుల నిమిత్తం శనివారం ఆలయ కార్యనిర్వాహనాధికారి కె.ఎస్.రామారావును కలిసి అందజేయగా, ఆలయ అధికారులు వీరికి కనక దుర్గమ్మ అమ్మవారి దర్శనం కల్పించి, వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించగా, ఈవో శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం మరియు చిత్రపటం అందజేశారు.

మృతుని కుటుంబీకులతో మాట్లాడుతున్న సురేష్

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భవానీపురం హౌసింగ్ బోర్డ్ ప్రాంతానికి చెందిన ముడి గోడుపుల పవన్ కుమార్ అనే యువకుడు పవన్ కళ్యాణ్ వీరాభిమాని కాగా, నెలరోజుల క్రితం ప్రమాదానికి గురై హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మరణించారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష, సురేష్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి అనూష, సురేష్ మాట్లాడుతూ జనసేనాని పవన్‌కల్యాణ్ అభిమాని పవన కుమార్ మృతిచెందడం బాధాకరమన్నారు. తాము జనసేన కార్య కర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు.

కూటమి విజయోత్సవం

ప్రజాశక్తి - విస్సన్నపేట : కూటమి విజయాన్ని పురస్కరించుకుని బస్టాండ్ సెంటర్లోని ద్వారక హోటల్ యజమాని, జనసేన నాయకులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథిగా తిరువూరు నియోజక వర్గ టిడిపి ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాస రావు హాజరయ్యారు.



విజయోత్సవంలో పాల్గొన్న కొలికపూడి

ఎన్‌ఆర్‌ఐ గిరికి సన్మానం

ప్రజాశక్తి - విస్సన్నపేట :

కలగర లక్ష్మీ పురంలో ఎన్‌ఆర్‌ఐ వల్లభనేని గిరి నివాసం వద్ద టిడిపి నాయకులు తను చేసిన సేవా కార్యక్రమాల ద్వారా ప్రచారంతో కూటమి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు భారీ మెజార్టీతో గెలవడంతో గెలుపులో ప్రధానపాత్ర పోషించిన ప్రముఖులు వల్లభనేని గిరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పల్లెపాం రాంబాబు, కొంగల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గద్దె రామ్మోహన్‌కు శాలువా కప్పి సత్కరిస్తున్న తిరుపతి అనూష, సురేష్

హ్యాట్రిక్ సాధించిన గద్దెకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి, వన్‌టౌన్ :

ఇటీవలి ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిగా విజయవాడ తూర్పు నియోజకవర్గ నుండి టిడిపి తరపున అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌ను విజయవాడ 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష సురేష్‌లు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా హేట్రిక్ సాధించిన గద్దెకు అభినందనలు తెలిపారు.

ఇప్పటివరకూ రూ. 30 లక్షల విరాళాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారి ఆలయ స్వర్ణ తాపడం పనులకు గానూ ఇప్పటివరకూ దాతలు ఇచ్చిన విరాళం రూ. 30 లక్షల 27 వేల 434లు అని ఆలయ ఇఒ కెఎస్ రామారావు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీన కొండపైన నూతనంగా డోనార్ సెల్ భవనం నిర్మించినప్పటి నుండి ఈరోజు వరకు పలువురు దాతలు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ స్వర్ణ తాపడం పనులకు గానూ రూ. 30,27,434లు అందజేసినట్లు ఇఒ కె.ఎస్.రామరావు వివరించారు. శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం గోపురం (ప్రస్తుతం బంగారం)తో పాటు మిగిలిన ఆలయాన్ని పూర్తిగా కనకం (బంగారం)తో స్వర్ణతాపడం చేసేందుకు దాతలు దేవస్థానానికి విరాళాలు అందజేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు కోరారు.

17 నుండి ఎంబివికెలో కంప్యూటర్ కోర్స్‌ల శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నరుపేట రాఘవయ్యపార్క్ సమీపంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో ఈనెల 17వ తేదీ నుండి కంప్యూటర్ కొత్త కోర్సులు ప్రారంభం కానున్నాయని కంప్యూటర్ విభాగం బాధ్యులు టి.క్రాంతికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, డిటిపి, సి లాంగ్వేజ్, ట్యాలీ కోర్సులకు కొత్త బ్యాచ్‌లు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతి కోర్సు కాలవ్యవధి 2 నెలలని, ఆసక్తిగల వారు ఫీజులు, సమయం తదితర వివరాలను నేరుగా తమ కార్యాలయంలోగానీ లేదా 7382193413, 9490098042 మొబైల్ నెంబర్లకు ఫోన్ చేసిగానీ తెలుసుకుని తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అతి తక్కువ ఫీజుతో, సీనియర్ ఫ్యాకల్టీతో నాణ్యమైన కంప్యూటర్ విద్యను గత ఎనిమిదేళ్ల నుడి వేలాది మందికి తాము అందించినట్లు తెలిపారు. ఆశక్తి ఉన్న విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగాలు చేస్తున్న వారు ఎవరైనా వయస్సుతో సంబంధం లేకుండా ఈ కోర్సులు నేర్చుకోవడానికి అర్హులని తెలిపారు.

వామపక్ష ఉద్యమ శ్రేయోభిలాషి

రావూరి కనక విజయలక్ష్మి

- నేడు చినముత్తేవిలో సంస్మరణ సభ

కనక విజయలక్ష్మి (ఫైల్)

కృష్ణాజిల్లా మొవ్వ మండలం చినముత్తేవి గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, కార్మిక నేత రావూరి అజయ్ కుమార్ సతీమణి కనక విజయలక్ష్మి ఆకస్మికంగా మరణించడం ఆ కుటుంబంతో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరికీ, అభ్యుదయ, వామపక్ష శ్రేయోభిలాషులకు తీరనిలోటు. ఈనెల 2వ తేదీన అమెరికాలోని తన కుమారుని గృహంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో తుదిశ్వాస విడిచారు. గత నెలలో విమానంలో అమెరికాకు బయల్దేరిన ఆమె స్పృహ తప్పి పడిపోవడంతో సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుండి కోమాలోనే ఉన్న ఆమె గత ఆదివారం మృతిచెందారు. ఆమె భౌతిక కాయాన్ని వైద్య పరీక్షల కోసం అమెరికాలోని వైద్య కళాశాలకు అందచేశారు. విజయలక్ష్మి తన కుటుంబంలోని అందరి కష్టసుఖాల్లో పాలు పంచుకో వడమే కాకుండా వామపక్ష ఉద్యమాలకు తోడుగా ఉన్నారు. సిపిఎం కార్యకర్తలకు సమయంతో సంబంధం లేకుండా ఎప్పుడు వెళ్లినా భోజనం, ఇతర ఏర్పాట్లు క్షణాల్లో చేసేవారు. సిపిఎం శ్రేణులంటే ఆమెకు అంత అభిమానం. భర్త రావూరి అజయ్ కుమార్ అలహాబాద్ బ్యాంకులో సుదీర్ఘకాలం పనిచేశారు. బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫి) అలహాబాద్ బ్యాంకు విభాగానికి రాష్ట్ర, జాతీయ నాయకునిగా బాధ్యతలు నిర్వర్తిం చారు. ఆయనకు విజయలక్ష్మి అన్ని విధా లుగా సహక రించారు. చినముత్తేవి గ్రామంలో నిర్మించిన భవనాన్ని పార్టీ కార్యక్రమాలకు కేంద్రంగా మార్చారు. అది తమ ఆస్తిగా కాకుండా ప్రజా ఉద్యమాల కేంద్రంగా ఉపయోగపడాలని ఆకాంక్షించారు. చినముత్తేవి గ్రామంలో ప్రజాశక్తి ఏజెన్సీని ప్రారంభిం చటం, మొవ్వ మండల ప్రజాశక్తి విలేకరి నియామకానికి, చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజా సంఘాల నిర్మాణానికి ఆ కుటుంబం చేసిన కషి మరువలేనిది. కుటుంబ సభ్యులందరికీ శాస్త్రీయ భావాలతో బతకడం నేర్పించారు. అజయ్‌కుమార్ భౌతికకాయాన్ని ప్రయోగాల నిమిత్తం పెద అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు అందజేశారు. ఆ సమయంలో బంధువులంతా సాంప్రదాయ పద్ధతుల్లో అంత్యక్రియలు నిర్వహించాలని కోరినా విజయలక్ష్మి... తన భర్త ఆశయాలకు అనుగుణంగా చివరి క్రతువు నిర్వహించారు. ఎలాంటి శషబిషలు లేకుండా వెంటనే పార్టీ పద్ధతుల్లోనే అంత్యక్రియలు నిర్వహించడానికి ముందుకు వచ్చారు. స్వాతంత్ర్య ఉద్యమానికి, ఆ తర్వాత చల్లపల్లి జమిందారీ వ్యతిరేక ఉద్యమానికి నేతృత్వం వహించిన రావూరి సత్యం వారసత్వాన్ని ఆ కుటుంబం కొనసాగించడం శ్లాఘనీయం. ప్రత్యేకించి మా కుటుంబంతోనూ, నేను ఇంటి వద్ద లేని సందర్భాల్లోనూ పెద్ద వయస్కురాలైన నా తల్లిని ఆమె తన సొంత తల్లిలాగే జాగ్రత్తగా చూసుకునేవారు. కొంత కాలం క్రితమే అజయ్ కుమార్, ఆ వెంటనే విజయలక్ష్మి మరణించడం వారి కుటుంబ సభ్యులకు తీరనిలోటు. ఆమెకు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ తరఫున, మా కుటుంబం తరఫున తీవ్ర సంతాపం తెలియజేస్తున్నాను. అలాగే వారి పిల్లలు ప్రియాంక, చేతు, రమేష్, వారి సోదరుడు సాయి, వారి సోదరికి, మిగిలిన కుటుంబ సభ్యులకు, చినముత్తేవి గ్రామంలోని అజయ్, విజయలక్ష్మి అభిమానులకు సానుభూతి తెలియజేస్తున్నాను.

- ఎం.హరిబాబు,
ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి

నేడు సంస్మరణ సభ

సిపిఎం సీనియర్ నాయకులు, కార్మిక నేత రావూరి అజయ్ కుమార్ సతీమణి కనక విజయలక్ష్మి సంస్మరణ సభ ఆదివారం మధ్యాహ్నం జరుగుతుందని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, మండల కార్యదర్శి కాకి రాజశేఖర్, కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని చిన ముత్తేవి గ్రామంలో ఈ సంస్మరణ సభ జరుగుతుందని వారు పేర్కొన్నారు.

విద్యార్థి దశ నుంచి చురుగ్గా ఉండేవారు

- రామోజీరావు చిన్ననాటి స్నేహితుడు పాపారావు

ప్రజాశక్తి-చల్లపల్లి : విద్యార్థి దశ నుంచే రామోజీరావు కార్యదక్షత చూపేవారని రామోజీరావు చిన్ననాటి మిత్రులు, కార్మిక నాయకులు మిక్కిలినేని పాపా రావు అన్నారు. శనివారం చల్లపల్లిలో ఆయన మాట్లాడుతూ రామోజీరావు మతి పట్ల విచారం వ్యక్తం చేశారు. గుడివాడ కళాశాలలో రామోజీరావు బీఎస్సీ, తాను బీఏ చదువుకున్నట్లు పాపారావు తెలిపారు. విద్యార్థి నాయకునిగా రామోజీరావు చురుకుగా ఉండేవారని, ఈనాడుతో సహా అనేక సంస్థలు స్థాపించి వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు.

పునాదిపాడులో రోడ్డుపైనే మురుగు నీరు

- వాహనదారులు, స్థానికుల ఇబ్బందులు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు-గన్నవరం ప్రధాన రహదారి అయిన పునాదిపాడు రోడ్డు కొద్దిపాటి వర్షానికి నీళ్ల రోడ్డుపై నిలుస్తుండడంతో వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నేషనల్ హైవేని ఆనుకుని ఉన్న గన్నవరం రోడ్డు పూర్తిగా దెబ్బతిని నీళ్ల నిలుస్తున్నాయి. అలాగే జడ్పీ హైస్కూల్ ముందు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల నీరు నిలిచి ఉండి ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. రహదారి ప్రక్కన డ్రైనేజీపై కొంతమంది వ్యాపారులు కాంక్రీట్ పోసి రోడ్డును, డ్రైనేజీని ఆక్రమించుకుంటున్నారు. దీంతో నీరు డ్రైనేజీల్లోకి వెళ్లకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బం

పునాదిపాడులో ప్రధానరహదారిపై నిలిచిన నీరు

దులకు గురవుతున్నారు. రానున్నది వర్షాకాలం కనుక అధికారులు త్వరితగతిన స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సిసి రోడ్ల నిర్మాణంలో

నాణ్యతకు తిలోదకాలు

- రెండు నెలలకే పగుళ్లు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-పెడన : అధికారుల పర్యవేక్షణతో కొరవడంతో కొట్లాది రూపాయల ప్రజా సొమ్ము బూడిదలో పోసిన పన్నీరుల తయారైంది. పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో తూగుతుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఫలితంగా దశాబ్దాలు కాలం ఉండాల్సిన రోడ్లు నెలలు వ్యవధిలోనే నిరుపయోగంగా మారుతున్నాయి. వివరాల్లో వెళితే రెండేళ్ల క్రితం నుంచి గత ప్రభుత్వం గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ఒక్కో సచివాలయానికి 20 లక్షలు చొప్పున రెండు విడుదలగా నిధులను విడుదల చేసింది. ఈ నిధులతో ఆయా వార్డులలోని అంతర్గత రోడ్లను సిమెంట్ రోడ్లుగా వేసేందుకు కేటాయించింది. మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డులను ఒక కోటి 66 లక్షలు నిధులను సమకూర్చింది. వీటి నుంచి మున్సిపల్ అధికారులు, నాయకులు 21 చోట్ల సిమెంట్ రోడ్లు వేశారు. మొదటి విడతగా 2022 - 23 మార్చి నాటికి పూర్తిగా కాగా రెండో విడతగా 2024 మార్చి నాటికి పూర్తయ్యాయి. అయితే వీటిల్లో నిర్మించిన సిసి రోడ్లలో నాణ్యత కొరవడింది. ఈ నిధులతో కేటాయించిన పనులు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దారులు సదరు గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం కారణంగా తెలుస్తుంది. స్థానిక 22వ వార్డు వీరభద్ర స్వామి ఆలయం ప్రక్కనే ఉన్న సిమెంట్ రోడ్డు ఈ ఏడాది మార్చిలో వేశారు. అయితే కేవలం రెండు నెలల కాలంలోనే ఈ రోడ్డు పలుచోట్ల పగుళ్ల వచ్చాయి. అలాగే 21 వ వార్డు వైఎస్ఆర్ కాలనీకి వెళ్లే రోడ్డులో కూడా పగుళ్ళు వచ్చాయి. అంతేకాకుండా మిగిలిన 18 పనుల్లో కూడా అక్కడక్కడ ప్రారంభానికి ముందే ఇలా జరగడం మున్సిపల్ అధికారులు పని తీరుకు నిదర్శనంగా తెలుస్తోంది.

పర్సంటేజీలే కారణమా

గత ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తున్న పర్యవేక్షించాల్సిన నాయకులు, అధికారులు సదరు గుత్తేదారుల వద్ద నుంచి పర్సంటేజీలకు కక్కుర్తి పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అందువల్లే దశాబ్ద కాలాలపాటు ఉపయోగంలో ఉండాల్సిన రోడ్లు కేవలం నెలల వ్యవధిలోని పగుళ్ళు రావడం కారణంగా తెలుస్తుంది. ఇప్పటికైనా ప్రస్తుతం ప్రభుత్వ నాయకులు వీటి పైన దష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై మున్సిపల్ ఏఈ రామాంజనేయులు వివరణ కోరగా ఆయా అవార్డులోని వేసిన సిసి రోడ్లు పగులు విషయం తన దష్టికి వచ్చిందన్నారు. సదరు గుత్తేదారులను పిలిపించి మరమ్మత్తులు నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు.

సిమెంట్ రోడ్డుకు పగుళ్లు వచ్చిన దృశ్యం

పదవులకు రాజీనామా

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం మంగళాపురం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చైర్మన్ పేరం నాగిరెడ్డి అన్నారు. శనివారం మంగళాపురం పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ నాగిరెడ్డి, పర్సన్లు కొర్రపాటి ముఖర్జీ, కాళింగి ఆదిలక్ష్మి తమ పదవులకు రాజీనామా చేశారు. త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంగా వారిని సొసైటీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వం తమకు ఇచ్చిన పదవికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ చంద్ర రవి, సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి సాయం అందిస్తున్న దృశ్యం

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం ప్రశాంత్ నగర్‌లో రెండు కిడ్నీలు పూర్తిగా పాడై ప్రాణాపాయ స్థితిలో ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న కుటుంబానికి కష్ణ జిల్లా మాలమహానాడు అధ్యక్షులు దోవా గోవర్ధన్ సహకారంతో పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కాకర్లమూడి రాజేష్ కొద్దికాలంగా రెండు కిడ్నీలు పూర్తిగా పాడైపోవడం అతని ఆర్థికస్తోమత సరిగా లేకపోవడంతో ముగ్గురు కొడుకులు చదువుకి దూరమై పొట్ట కోటి కోసం పలు రకాల పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు ఈ విషయం తెలుసుకున్న కష్ణాజిల్లా మాల మహానాడు బాధితులకి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించింది మరి కొంతమంది దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గం ఇంచార్జ్ బొంతు నరేష్, గ్రామస్తులు కే సుధాకర్, కే బాబుజీ, ఏం భాను, టి రాజేష్, పి నాగరాజు, కే రాజు, తదితరులు పాల్గొన్నారు.

వెనిగండ్ల రాముకు సత్కారం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక జగన్నాథపురంలోని శ్రీ భూనిలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థాన అధికారులు ఎమ్మెల్యే రామును సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, దేవాదాయ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

మల్లేల పిఎసిఎస్ చైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం మల్లేల పిఎసిఎస్ చైర్మన్ పదవికి కలకొండ రవికుమార్ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయనతో పాటు ఇద్దరు డైరెక్టర్లు కూడా రాజీనామా పత్రాలను సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 5 సంవత్సరాల కాలంలో మల్లెల సొసైటీని రైతులు శ్రేయస్సు ధ్యేయంగా అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. 2018లో డిపాజిట్లు రూ.7 కోట్లు 20 లక్షలు ఉంటే నేడు డిపాజిట్లు 9 కోట్ల 70 లక్షలు పెరిగాయన్నారు. 2018లో క్రాప్ లోన్స్ రూ.9 కోట్ల 30 లక్షలు అయితే నేడు రూ.11 కోట్ల 92 లక్షలు ఇచ్చామన్నారు. ఎల్‌టి లోన్స్ రూ.9 కోట్ల 16 లక్షలకు గానూ నేడు రూ.12 కోట్ల 94 లక్షలు ఇచ్చామని చెప్పారు. నాడు జీరోగా ఉన్న రైతు నేస్తంను నేడు రూ.6 కోట్ల 24 లక్షలు వరకు ఇచ్చినట్లు రవి కుమార్ తెలిపారు. 2018లో కర్షక మిత్ర నుండి రైతులకు ఒక్కలోను కూడా ఇవ్వని పరిస్థితి ఉంటే వైసిపి ప్రభుత్వంలో రూ.4 కోట్ల 52 లక్షలు, రూ.9 కోట్ల 62 లక్షలు రైతులకు ఇచ్చామని వెల్లడించారు.

బాధితులకు సాయం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన చంద్రం హోటల్ నిర్వాహకులకు గుళ్ళపల్లి ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. ఫౌండేషన్ సభ్యులు గుళ్లపల్లి వెంకట రత్నం మాజీ ఎంపిపి గద్దె వెంకటేశ్వరరావు చేతుల మీదగా రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని హోటల్ యజమాని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గుళ్ళపల్లి ఫౌండేషన్ ప్రతినిధులు గద్దె వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

టిడిపికి పట్టం కట్టిన వడ్డెరలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధికార ప్రతినిధి, రాష్ట్ర వడ్డెర నాయకులు తాళ్లూరి వెంకటేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా శనివారం కార్యకర్తలతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో వడ్డెర్లందరూ రాష్ట్రవ్యాప్తంగా టిడిపికే పట్టం కట్టారని అన్నారు. గత ఐదేళ్లలో నిర్మాణ రంగం కుదేలైందని అన్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులందరూ రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయకత్వంలో వడ్డెరలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పుట్టినరోజు సందర్భంగా మండలంలోని చిల్లకల్లు గ్రామంలోని భారీ మెజార్టీకి కృషిచేసిన నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తాతయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

టిడిపి శ్రేణుల విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - విసన్నపేట : ఎన్నికల్లో టిడిపి కూటమి భారీ విజయం సాధించడంతో శుక్రవారం సాయంత్రం విసన్నపేట మండలం తెల్లదేవరపల్లి గ్రామంలో టిడిపి కూటమి నాయకులు కార్యకర్తలు భారీ బహిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విస్సన్నపేటలో టిడిపి బలోపేతం అవ్వడానికి భారీ విజయం సాధించడానికి ముఖ్య పాత్ర పోషించిన ప్రముఖ ఎన్నారై వల్లభనేనిగిరి పాల్గొన్నారు. ఈ ర్యాలీలో భాగంగా నిర్మాణంలో ఉన్న చర్చికి తన వంతు సహాయం సంఘస్తులు, సంఘ కాపరి అడగ్గా వెంటనే రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. సంఘకాపరి, సంఘస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయల నాగమణి, టిడిపి నాయకులు రాయల సురేష్ రాజా రాయల వేణు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం ముందు సౌమ్య బ్యానర్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణ వైసిపి కార్యాలయం ముందు నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య బ్యానర్ కట్టడం పట్ల చర్చనీయాంశంగా మారింది. వైసిపి కార్యాలయం నందిగామలో గత పది సంవత్సరాల నుండి అద్దె భవనంలో ఉంటుంది. ఇంటి యజమాని గంగవరపు నరసింహారావు వైసిపి కార్యాలయం ఖాళీ చేయించారు. నరసింహారావు ఇటీవల వైసీపీ నుండి టిడిపిలోకి మారారు. దీంతో తన ఇంటిపై టిడిపి బ్యానర్ కట్టారు. శుక్రవారం రాత్రి నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య బ్యానర్ కట్టారు. ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గీతా మందిరం రోడ్డు, ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ ప్లాట్‌లోకి మార్చారు.

లింగాలపాడులో పారిశుధ్యం అధ్వానం

కాల్వలో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో గ్రామ పారిశుధ్యంను ఆటకెక్కించారు. పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో సైడ్ కాలువలలో చేత్త పేరుకుపోయింది. మురికి నీరు పారక కాలువలలో చేత్త కుల్లిపోయి మురికి వాసనతో ముక్కులు పగిలిపోయే వాసన వస్తుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి కి నెలరోజుల నుండి పిర్యాదు చేస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న వైనం నెలకొంది. లింగాలపాడులో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శిపై తక్షణమే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి తక్షణమే స్పందించి గ్రామంలో పర్యటించి విచారించవలసినదిగా గ్రామ ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో సైడ్ కాలువలలో సిల్ట్ తీసి సంవత్సరం అవుతుంది. ఈ విధంగా సైడ్ కాలువలలో సిల్ట్ తీయకుండా ఉండటం వల్ల గ్రామంలో అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున తక్షణమే పై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నందిగామ ప్రజలు అధైర్య పడొద్దు : ఎంఎల్‌సి అరుణ్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో టిడిపి చేస్తున్న విధ్వంసాలు – అరాచకాలను.... చూసి ప్రజలకు కనువిప్పు కలుగుతుందని ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. నందిగామ గీత మందిరం రోడ్డులోని ఎంఎల్‌సి కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. నందిగామ వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధైర్యపడొద్దని ఎంఎల్‌సి సూచించారు. కార్యకర్తలకు తోడుగా నిలుస్తామన్నారు. ఎన్నికల్లో మాకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. 'ఎమ్మెల్సీ'గా నా రాజీనామాను కోరుతూ.... విపరీతంగా ట్రోల్స్, కాల్స్ చేస్తున్న టిడిపి శ్రేణులకు సమాధానంగా తన రాజీనామాను అడిగే నైతిక అర్హత లేదన్నారు. అమలు సాధ్యం కానీ హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చిన టిడిపి ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయించేలా ప్రజల తరపున 'ప్రశ్నించే గొంతుకలా'.... శాసన మండలిలో గళమెత్తటానికి బాధ్యత కలిగిన మండలి సభ్యుడిగా.... కొనసాగడానికి సిద్ధమయ్యానన్నారు. రాజకీయాల్లో ఉన్నంతకాలం వై.యస్.జగనన్న తోనే నడుస్తాం అని స్పష్టం చేశారు.

ఎబినేజర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజక వర్గంలోని సేవకుల కమిటీ సభ్యులు శనివారం పట్టణంలోని యేసయ్య జవాబు చర్చిలో సమావేశమై జగ్గయ్యపేట నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రెవరెండ్ ప్రభుదాస్, అధ్యక్షులుగా నకరికంటే జోసఫ్, కిరణ్ సెక్రటరీగా కరిశె రవికుమార్, ట్రెజరర్ గా హనోక్ నాయక్ జాయింట్ సెక్రటరీగా బి.చంద్రపాల్, సబ్ ట్రెజరర్ గా కేజే హెన్రీ, వైస్ ప్రెసిడెంట్‌గా కె.అశోక్, కె.ఆశీర్వాదం, డి.ఆనందరావు, చీఫ్ అడ్వైజర్స్‌గా బి.వైపి దాస్ సాల్మన్ ప్రసాద్, జి.దేవ సహాయం, ప్రతాప్ కోఆర్డినేటర్స్‌గా డేనియల్ ఎజ్రాశాస్త్రి, శామ్యూల్ నిరీక్షణ, జాన్ రమ్య బాబు, ఎల్ ప్రవీణ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రూపస్ బాబు, ఎం.అగస్టీన్, జి.విజయరాజు, ఎం.లాజర్, కేఎన్ఆర్ పాల్‌లు ఎన్నికయ్యారు.

రామోజీరావుకు పలువురి నివాళి

నివాళులర్పిస్తున్న శ్రీరాం తాతయ్య

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, అక్షర యోధుడు చెరుకూరి రామోజీరావు మరణానికి సంతాపం తెలియజేస్తూ శనివారం వించిపేటలో తెలుగుదేశం నాయకులు ఎమ్.ఎస్.బేగ్ కార్యాలయంలో ఎమ్.ఎస్ బేగ్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుఖాసి కిరణ్, బూర కనకారావు, సుకాసి సరిత, అబ్దుల్ సత్తార్, బెవర సాయి సుధాకర్, నమ్మి, టీమ్ టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈనాడు, ఈ–టివి అధినేత రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో మృతిచెందిన చెరుకూరి రామోజీరావు పార్థీవ దేహాన్ని బుద్ధా వెంకన్న సందర్శించి ఘన నివాళలర్పించారు.

రెడ్డిగూడెం : ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు. టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** హైదరాబాద్ రామోజీ ఫిలిం సిటీలో శనివారం రామోజీరావు భౌతిక కాయాన్న టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏపీడబ్ల్యు యూనియన్ నాయకులు నివాళులర్పించారు. పట్టణంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) నివాసంలో శనివారం నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్యతో కలిసి తాతయ్య రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి తెలుగు అక్షర సమాజానికి తీరని లోటని, ప్రజా పక్షపాతి, అలుపెరుగని అక్షర యోధుడికి కన్నీటి నివాళులర్పిస్తున్నానని మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురాం అన్నారు. **నందిగామ :** రామోజీరావు మృతికి నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సంతాపం వ్యక్తం చేశారు. నందిగామ కాకానీ నగర్ పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పట్టణ పార్టీ శ్రేణులతో కలసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నందిగామ జర్నలిస్టులు నివాళులర్పించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు ఆకుల వెంకట నారాయణ, శాకమూరు మల్లి ఖార్జునరావు, సుగుణ శేఖరరావు, ది న్యూ ఇండియన్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు మీరాహుస్సేన్ ఖాన్ తదితరులు నివాళు లర్పించారు.

ఇబ్రహీంపట్నం : రామోజీరావు మృతి మీడియా కళాకారుల రంగానికే తీరని లోటని, బొర్రా కిరణ్ అన్నారు. కొండపల్లి పురపాలకలో రామోజీరావు సంతాప సభలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రామినేని రాజశేఖర్, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టి బాబు, కొండపల్లిమున్సిపల్ పార్టీ అధ్యక్షులు చుట్టుకుదురు శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. హైదరాబాద్ రామోజీ ఫిలింసిటీలోరామోజీరావు భౌతిక కాయానికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నివాళులర్పించారు. చెరుకూరి కిరణ్‌కు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్... రామోజీరావు భౌతిక కాయం వద్ద నివాళు లర్పించారు.

వన్‌టౌన్ : అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు వేముల వెంకట్రావు ఆధ్వర్యంలో రామోజీరావుకు ఘన నివాళులర్పించారు. వాగు సెంటర్లోని వారి కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చైర్మన్ నాగమల్లేశ్వరరావు మాట్లాడారు. విజయవాడ నగర ప్రముఖులు డాక్టర్ ఎన్వి.రావు, సూర్యారావు, బలివాడ శివకుమార్ పట్నాయక్, భోగవల్లి శ్రీధర్, బాయన శేఖర్ బాబు, నమ్మి అప్పారావు, రాజగిరి సోమేశ్వరావు, లక్ష్మణ్ నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమా

తాగునీటిపై అలసత్వంవహిస్తే చర్యలు : కొల్లు

హెడ్ వాటర్ వర్క్సులో తనిఖీలు నిర్వహిస్తున్న కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం శాసనసభ్యులు కొల్లు రవీంద్ర నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజును ఆదేశించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన రవీంద్రనగరంలో ఆకస్మిక పర్యటనలు మొదలెట్టారు. ఈ నేపథ్యంలోనే శనివారం మచిలీపట్నం హెడ్ వాటర్ వర్క్సు లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కుళాయిల ద్వారా మురుగునీరు వస్తుండటంపై ఎఈ సాయిప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతులు మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అసలు కుళాయిల ద్వారా మురుగు నీరు ఎందుకు వస్తుంది దీనివల్ల ప్రజలు ఎన్ని అనారోగ్య సమస్యలకు గురి అవుతారో తెలుసా అని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అనంతరం రవీంద్ర విలేఖర్లతో మాట్లాడుతూ హెడ్ వాటర్ వర్క్సులో అనేక లోపాలు గుర్తించాం అని పంపింగ్ వ్యవస్థ చాలా అస్తవ్యస్తంగా ఉందన్నారు. జోనల్ వారీగా పంపింగ్ చేయడం వల్ల ప్రతి రోజూ ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు అస్కారం ఉంటుందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటాం అన్నారు. తాగునీటి సరఫరాలో పర్యవేక్షణ లోపంతోపాటు అధికారుల్లో నిర్లక్ష్యం ఉందన్నారు. అదేవిధంగా తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద ట్రాన్స్ ఫార్మర్ కెపాసిటీ పెంచేందుకు ఆదేశాలు ఇచ్చాం అన్నారు.గతంలో తాము నిర్మించిన రిజర్వాయర్లను వినియోగించని కారణంగా దిష్టిబొమ్మల్లా మారాయన్నారు. ఆ రిజర్వాయర్లన్నింటినీ వినియోగంలోకి తీసుకువస్తాం అన్నారు. గత పాలకులు అధికారులను స్వేచ్ఛగా పని చేయనివ్వలేదన్నారు. ప్రజల అవసరాల కోసం వినియోగించాల్సిన తాగునీటిని ప్రైవేట్ ప్రాజెక్ట లకు ఉపయోగించారని ఒక విధంగా చెప్పాలంటే మంచి నీటిని గత పాలకులు అమ్ముకున్నరన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జలజీవన్ కింద కష్ణా నది నుండి నేరుగా పైప్‌లైన్ నిర్మించేందుకు కషి చేస్తాం అని తథ్ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలన్నదే మా లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం వి బాబా ప్రసాద్, టిడిపి కార్పొరేటర్లు, ఉన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యుల సత్కారం

మచిలీపట్నం నియోజకవర్గ శాసనసభ్యునిగా ఎన్నికైన కొల్లు రవీంద్రను ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ మచిలీపట్నం డివిజన్ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ప్రైవేట్ స్కూల్స్ అభివద్ధికి కషి చేయాలని రవీంద్రని కోరారు. ఎమ్మెల్యే రవీంద్రని కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు స్టేట్ కౌన్సిల్ అధ్యక్షులు కొమరగిరి చంద్రశేఖర్, స్టేట్ కౌన్సిల్ సలహాదారు వి సుందర రామ్, సీహెచ్ రాజు, కష్ణాజిల్లా అధ్యక్షులు ఏ. వి. జి. ఎస్. ఆర్. గౌరీ ప్రసాద్, ఉపాధ్యక్షులు నవీన్, డివిజన్ అధ్యక్షులు కె.వి. జాన్, డివిజన్ కార్యదర్శి కె. నాగమోహనరావు, డివిజన్ సభ్యులు రామకష్ణ, శివ ప్రసాద్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న దృశ్యం

లోకేష్ గెలుపుపై సంబరాలు

ప్రజాశక్తి -మంగళగిరి : రాష్ట్రంలో కూటమి విజయం, మంగళగిరిలో భారీ మెజార్టీతో నారా లోకేష్ గెలుపు సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పేరం శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం కేక్ కట్ చేసి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ సభ్యులు డాక్టర్ కొండారెడ్డి నరహరి వర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ లోకేష్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గిరిజనులంతా టిడిపికి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ సభ్యులు బి.రమేష్, ఎం.గోవింద్, ఎం.రామకృష్ణ, ఎస్.పాపారావు, ఎస్.శ్రీను, బి.వాసు, వి.అన్నవరం, వి.ప్రసాద్, రామకృష్ణ, బి.తాతారావు, ఎం.రమేష్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తాడేపల్లి :** మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను ఎన్‌టిఆర్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షులు, పెనుమాకకు చెందిన పాలెపు రామారావు అమరావతి కరకట్ట వద్ద ఆయన నివాసంలో శనివారం కలిశారు. మంగళగిరిలో అత్యధిక మెజార్టీతో గెలిచినందుకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి పట్టణాల్లో అత్యధిక మెజార్టీ కట్టబెట్టినందుకు ప్రజలకు అభినందనలు తెలిపారు. లోకేష్ మాట్లాడుతూ మంగళగిరి అభివృద్ధికి కృషి చేద్దామని హామీనిచ్చారు.

ప్రజాశక్తి - పొన్నూరు : మంగళగిని ఎమ్మెల్యేగా ఎన్నికైన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను నిడుబ్రోలుకు చెందిన ఒ చర్చి పాస్టర్ ప్రిన్స్ మహేష్‌పాల్ శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టుదల, దీక్షతో మంగళగిరిలో రికార్డు మెజారిటీతో విజయం సాధించారని సత్కరించారు. రానున్న రోజుల్లో మంచి పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణంలో కదలిక

- మూడెకరాల్లో రూ.350 కోట్ల అంచనాలతో 2017లో పనులు ప్రారంభం
- వైసిపి పాలనలో అర్ధాంతరంగా నిలిపివేత
- కొన్నేళ్లపాటు మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- స్థానికుల ఆందోళనతో మూణ్ణెల్ల కిందట మళ్లీ పనులు

ప్రజాశక్తి - తుళ్లూరు : అమరావతి రాజధాని పరిధిలోని తుళ్ళూరులో ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెనుక వైపు కొద్దిదూరంలో ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణ పనులు కొద్దిరోజులుగా జరుగుతున్నాయి. 2017 డిసెంబర్ 28న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోరెన్సిక్ ప్రయోగశాలకు శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం రూ.350 కోట్లు మంజూరు చేయగా రాష్ట్ర ప్రభుత్వం సుమారు 3 ఎకరాలను కేటాయించింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ రిసోర్సెస్ బ్యూరో కార్యాలయం ఉంది. అదే తరహా కార్యాలయాన్ని మరింత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాలని తలపెట్టారు. 2019 ఎన్నికల్లో టిడిపి అధికారం కోల్పోయి వైసిపి రాష్ట్ర అధికార పగ్గాలు చేపట్టడంతో ప్రయోగశాల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ప్రయోగ శాల భవనం మందు బాబులకు నిలయంగా మారింది. భవనం పరిసరాలలో పిచ్చిమొక్కలు, కంప చెట్లు పెరిగి అడవిలా తయారైంది. రైతులు, స్థానికుల ఆందోళనతో మూడు నెలల క్రితం పనులు మొదలయ్యాయి. శాస్త్రీయమైన ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిజమైన నేరస్తులను గుర్తించడానికి అవసరమైన ఆధారాలు సేకరించడంలో, దర్యాప్తులో కీలకమైన అంశాలు పసిగట్టడంలో ఫోరెన్సిక్ ప్రయోగశాల కీలకం. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నేషనల్ సైన్స్ రిసోర్సెస్ బ్యూరో ఏర్పాటు చేయాలని టిడిపి ప్రభుత్వం భావించింది. రాష్ట్రంలో నేరాలకు సంబంధించిన అంశాలే కాకుండా దేశంలో ఎలాంటి కేసుకు సంబంధించైనా ఆధారాలు విశ్లేషించేలా ప్రయోగశాలకు రూపకల్పన చేశారు. డిఎన్ఎ, సైబర్, బయో మెట్రిక్, బాలిస్టిక్స్, ఫోరెన్సిక్ అకౌంటింగ్‌కు సంబంధించిన ఆరు ఎక్సలెన్స్ కేంద్రాలు, శిక్షణ, పరిశోధన, అభివృద్ధి విభాగాల ఏర్పాటుకు నిర్ణయించారు. ప్రయోగశాల నిర్మాణంతో పోలీస్ శాఖతో పాటు సిఐడి, సిబిఐ లాంటి దర్యాప్తు సంస్థలకు ఉపయోగ కరంగా ఉండే అవకాశం ఉంది. నిధుల లభ్యతకు అవకాశం ఉన్నా వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకమైన ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని తుళ్లూరుకు చెందిన రైతులు కాటా అప్పారావు, నరసింహారావు చెప్పారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక కొంతకాలం పాటు నిర్మాణ పనులు జరిగాయని, మూడు రాజధానులు ప్రకటన తర్వాత పూర్తిగా నిలిపివేశారని వారు చెప్పారు. కొద్దినెలలుగా తిరిగి పనులు మొదలు పెట్టారని, కూటమి అధికారంలోకి రావడంతో పనులు వేగవంతం అవుతాయని భావిస్తున్నామని అన్నారు.

తుళ్లూరులో నిర్మాణంలో ఉన్న ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల భవనం

టోల్ ఛార్జీలు, పాల ధరల పెంపు అన్యాయం

ప్రజాశక్తి-గుంటూరు : దేశవ్యాప్తంగా ప్రజలు ఎన్నికల హడావుడిలో మునిగి ఉన్న వేళ కేంద్ర ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా ప్రజలపై భారీ భారాన్ని మోపిందని అవగాహన సంస్థ విమర్శించింది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓట్ల లెక్కింపు కూడా జరగక ముందే కేంద్రం మోపిన ఈ భారాన్ని అత్యధిక మంది ప్రజానీకం గుర్తించలేదని, జేబులు ఖాళీ కావటం ప్రారంభమైన తర్వాతే ఎక్కువ మంది ఈ భారాన్ని గుర్తించారని పేర్కొన్నారు. ఏడు విడతల పోలింగ్ ప్రక్రియ జూన్ 1న ముగియగానే ఆ మరుసటి రోజు జూన్ 2న దేశవ్యాప్తంగా టోల్ ఛార్జీలు కేంద్రం పెంచేసిందని, అదేరోజు ప్రభుత్వ నియంత్రణలో ఉండే సంస్థలైన అమూల్, మదర్ డైరీలు కూడా పాల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 855 టోల్‌ప్లాజాల్లో సగటున ఐదు శాతం టోల్‌ఫీజు పెరిగిందని కనీసం రూ.5 నుండి రూ.20 వరకూ రోజు వారీ ప్రయాణికులపై, నెలపాస్‌లున్న వారిపై రూ.100 నుండి రూ.400 వరకు భారం పెరిగిందని పేర్కొన్నారు. ఈ పెంపుదలపై పార్టీలు, ప్రజాసంఘాలు, బాధ్యత గల పౌరులు తమ నిరసనను తెలియజేయాలని కోరారు.

రిటైర్డ్ ఆర్ఐ సుందర్రావు మృతి

ప్రజాశక్తి - మంగళగిరి : పట్టణంలోని పాత మంగళగిరి ప్రాంతానికి చెందిన మంగళగిరి మున్సిపాలిటీ రిటైర్డ్ ఆర్ఐ జెఎన్ఎన్ సుందర్రావు (74) శనివారం మృతి చెందారు. ఆయన కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సుందర్రావు భౌతికకాయాన్ని పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

నేటి నుంచి యోగా శిక్షణ

ప్రజాశక్తి - మంగళగిరి : స్థానిక శ్రీలక్ష్మీ నారాయణస్వామి దేవస్థానం ఆవరణలో శ్రీ రాధాకష్ణా యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నుండి ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు, ప్రధాన యోగాచార్యులు పడమట రాధాకృష్ణ యోగి గురూజీ శనివారం తెలిపారు. మూడు వారాలు పాటు శిబిరం కొనసాగుతుంన్నారు.

22న గిరిప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి-గుంటూరు : అరుణాచలంలో ఈనెల 22వ తేదీన పౌర్ణమి సందర్భంగా జరిగే గిరిప్రదక్షణ మహోత్సవాలకు గుంటూరు-2 డిపో నుండి స్పెషల్ హైటెక్ పుష్‌బ్యాక్ బస్ ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ షేక్ అబ్దుల్‌సలామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు ఈనెల 20వ తేదీ రాత్రి 9.15 గంటలకు గుంటూరులో బయలుదేరి, 21న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదేరోజు రాత్రి అక్కడ నుండి బయలుదేరి పౌర్ణమి రోజైన 22న అరుణాచలం చేరుకుంటుందన్నారు. అదేరోజు అరుణాచలేశ్వరుని దర్శించుకొన్న తర్వాత 22వ తేదీ సాయంత్రం అరుణాచలంలో బయలుదేరి 23వ తారీకు ఉదయం 6.30 గంటలకు గుంటూరు చేరుతుందని తెలిపారు. ఈ సర్వీస్‌కు 96164 నంబర్ ద్వారా ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కల్పించామని, ఒక్కో టికెట్ ధర 2420 అని తెలిపారు. అదనపు సమాచారం కోసం 7382897459, 7382896403, 7382894409 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చంద్రబాబును కలిసిన అసోచామ్ చైర్మన్ రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అసోసియేటెడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) ఆంధ్రప్రదేశ్ తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ కటారు రవి కుమార్ రెడ్డి కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన పారిశ్రామిక వృద్ధిని సామాజిక ఆర్థిక అభివృద్ధిని సాధిస్తుందని అన్నారు. ప్రధాన పరిశ్రమల్లో కొత్త అవకాశాలను అన్వేషించటానికి, రాష్ట్రాభివృద్ధికి దోహద పడేందుకు ప్రభుత్వంతో అసోచామ్ సహకరిస్తుందన్నారు.

కృషి, పట్టుదల అవసరం

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైస్ ఛాన్సలర్ జెఎన్‌టియు కాకినాడ డాక్టర్ జివిఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ఏ కోర్స్ చదివినా దానిలో ఉన్న జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, కృషి పట్టుదల అవసరమని అవి ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 780 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్నారని అందులో 8 మందికి గోల్డ్, 8 మంది సిల్వర్ మెడల్స్, అందుకున్నారన్నారు. కళాశాల టాపర్ కె.వెంకట సాయి సుప్రజకు 25 వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే అప్పారావు టి.సురేంద్ర సీనియర్ డైరెక్టర్ ఇన్ డేటా అండ్ ప్రాక్టీస్, కళాశాల కో ఫౌండర్ హానర్వరి చైర్మన్ లక్కిరెడ్డి జయప్రకాశ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్ రెడ్డి, ట్రస్టు బోర్డు మెంబర్స్, డీన్స్, వివిధ విభాగా ధిపతులు అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్ఏ సౌమ్యకు అభినందనలు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు అభినందనలు తెలిపేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. శుక్రవారం కాకానీ నగర్ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తంగిరాల సౌమ్యకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ, మండలాలకు చెందిన ముఖ్య విభాగాల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్రనాథ్, డీఎస్పీ రవికిరణ్, సీఐ హనీష్, నాగేంద్ర కుమార్, ఎస్ఐ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ హేమా మాలిని, ఎన్టీఆర్ జిల్లా డ్వామా పీడీ సునీత, దేవాదాయ ధర్మాదాయ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి, తహశీల్దార్లు, జలవనరుల శాఖ అధికారులు, అంగన్‌వాడీ ఉద్యోగులు పలు శాఖల ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సౌమ్యను కలిసిన అంగన్వాడీలు

హాట్ టాపిక్‌గా విఎంసి రాజకీయం!

టిడిపిలోకి వైసిపి కార్పొరేటర్ల చేరిక ప్రస్తుతం నగరంలో హాట్ టాఫిక్‌గా మారింది. రాష్ట్రంలో మారిన రాజకీయ మార్పులు ...విజయవాడ నగరపాలక సంస్థపై కూడా తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. వైసిపికి చెందిన అత్యధిక మంది కార్పొరేటర్లు ఎన్‌డిఎ మిత్రపక్షాల (టిడిపి, బిజెపి) ఎమ్మెల్యేలకు టచ్‌లో ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రతి నియోజకవర్గం పరిధిలో ఐదుగురు నుంచి ఏడెనిమిది మంది కార్పొరేటర్ల వరకు టిడిపిలోకో... లేదా బిజెపిలోకి జంప్ కావడానికి గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నారు. చివరకు వైసిపిలోని ప్రధాన పదవిలో ఉన్న కార్పొరేటర్ నుంచి సీనియర్ కార్పొరేటర్లలో ఎవరు ఉంటారో...ఎవరు జంప్ అవుతారో చెప్పలేని పరిస్థితి అని..వైసిపి నేతలతో పాటు టిడిపి నాయకులు సైతం బహాటంగానే వ్యక్తం చేస్తున్నారు. గత తన కుటుంబానికి..బిజెపితో ఉన్న అనుబంధం దృష్ట్యా బిజెపిలోకి మారిపోయి...ఇప్పటి మాదిరిగానే ప్రధాన పదవిని డిమాండ్ చేస్తే క్లిక్ అవుతుందా...? లేక ఫెయిల్ అవుతుందా? అనే దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. జోరుగా బిజెపి నేతలతో మంతనాలు జరుపుతున్నట్లు నగరంలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కార్పొరేటర్ల వారి రాజకీయ మనుగడ కాపాడుకోవడంతో పాటు మరీ ముఖ్యంగా వారి వారి పరిధిలో ఆర్థిక లావాదేవీలు కోల్పోకుండా...అక్రమార్జన ద్వారా సంపాదించుకున్న ఆస్తులకు రక్షణ కావాలన్నా ...తప్పక బలమైన రాజకీయ అండదండలు ఉండాలనే దిశగా వైసిపిలోని అనేక మంది పక్క చూపులు చూస్తున్నట్లు తెలిసింది. కార్పొరేటర్లగా, వివిధ స్థాయి హెూదాల్లో వైసిపిలో చలామణి అవుతూ... ఇప్పటి వరకు రాజకీయంగా, ఆర్థికంగా, ఇతర అన్ని రకాలుగా ఎంతో కొంత లబ్ధిపొందినా, వీరిని నమ్ముకున్న అభిమానులను

వీక్షణం

సైతం పక్కన నెట్టేసి, తమ భౌష్యత్ ముఖ్యమనుకొంటున్న పలువురు వైసిపి కార్పొరేటర్లు జంప్ జిలానీలుగా రడీకి సిద్ధం చేసుకుంటున్నట్లు అటు వైసిపి, ఇటు టిడిపిలో జోరుగా ప్రచారం జరుగుతోంది. వీటన్నింటికీ ముఖ్య కారణం ఈ ఎన్నికల్లో వైసిపి కనీసంగా ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోయి 11 సీట్లకు పరిమితం కావడం, గతంలో ఎన్నడూ ఎరగని స్థాయిలో మిత్రపక్షాలు (టిడిపి, జనసేన, బిజెపి) సీట్లు సాధించడంతో... వైసిపి కార్పొరేట్లు, శ్రేణుల్లో నైరాశ్యం నెలకొన్నది. ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీకి పూర్వవైభవం రావాలంటే ఇంకెంతకాలం పడుతుందోనని, అప్పటి వరకు వైసిపిని అంటిపెట్టుకొని అన్ని రకాలుగా నష్టపోయే కన్నా...సేఫ్ సైడ్‌గా దగ్గర మార్గాన్ని ఎంపిక చేసుకొని ...టిడిపిలోకో...లేదా దానిలో ఇమడలేమనుకుంటే... ఎటువంటి వారినైనా (అవినీతి సామ్రాట్‌లు, పార్టీ ఫిరాయింపుదారులు) విముద్చుకునే బిజెపిలోకి మారితే బాగుంటుందని పలువురు వైసిపి కార్పొరేటర్లు తమ రాజకీయ భవిష్యత్ చూసుకునే పనిలో ఉన్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థలో అధికార వైసిపికి 50 మంది కార్పొరేటర్లు, ప్రధాన ప్రతిపక్షం టిడిపికి 12 మంది, సిపిఎంకు ఒకరు చొప్పున కార్పొరేషన్‌లో ఆయా పార్టీలకు ప్రాతినిధ్యం ఉంది. 11వ డివిజన్ టిడిపి కార్పొరేటర్ కేశినేని శ్వేత ఈ ఎన్నికలకు ముందు ఆపార్టీకి, కార్పొరేటర్ పదవికి సైతం రాజీనామా చేసి, వైసిపిలో చేరిన విషయం తెలిసిందే. అలాగే 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య టిడిపి నుంచి వైసిపిలోకి మారిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కౌన్సిల్‌లో టిడిపికున్న కార్పొరేటర్ల సంఖ్యాపరంగా, అలాగే నగరంలో నూతనంగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు, విజయవాడ ఎంపితో కలుపుకొని నాలుగురు ఎక్స్‌అఫిషియే మెంబర్లు టిడిపికి తోడవుతారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుంటే కనీసంగా మరో 18 నుంచి 20 మంది కార్పొరేటర్ల బలం టిడిపికి కౌన్సిల్‌లో అవసరం కానున్నది. టిడిపికి అవసరం కానున్న వైసిపిలోని కార్పొరేటర్లను వివిధ రూపాల్లో లొంగదీసుకొని...తమ వైపుకు మళ్లించుకోవడానికి టిడిపి, బిజెపిలు సైతం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంలో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే ముందంజలో ఉన్నట్లు తెలిసింది. అలాగే సెంట్రల్, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేలు వైసిపి కార్పొరేటర్లను రాబట్టుకునేందుకు పలు రూపాల్లో రాయితీలు ప్రకటిస్తూ వారిని ఆకర్షించే పనిలో ఉన్నట్లు తెలిసింది.

- రాజు

పిబి సిద్ధార్థలో ప్లేస్‌మెంట్స్ డే

హాజరైన విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న హేమచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల శిక్షణా ఉపాధి విభాగం ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరంలో 40 సంస్థలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఇప్పటివరకు 280 మంది విద్యార్థులు అవకాశాలు సాధించిన సందర్భంగా శనివారం కళాశాలలో ప్లేస్‌మెంట్ డే వేడుకలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ బహుళ జాతీయ సంస్థ ఏడీపీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ కుర్రా హేమచంద్ర ముఖ్య అతిథిగా విచ్చేసి కళాశాల నుండి కార్పొరేట్ ప్రపంచంలోకి అడుగు పెట్టబోతున్న విద్యార్థులకు దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి జీవితంలో విజయం సాధించడానికి వృత్తి నైపుణ్యం, భావవ్యక్తీకరణ నైపుణ్యం, సమయ పాలన, మార్పులకు అనుగుణంగా తమని తాము మలచుకోవడం, సమస్యా పరిష్కార నైపుణ్యం, వృత్తి జీవితం – కుటుంబ జీవితం మధ్య సమతుల్యత, నిరంతర అధ్యయనం, వృత్తి పరిచయాలు, ఆర్థిక నిర్వహణ, క్రమశిక్షణ, కార్పొరేట్ మర్యాదలు వంటి పది సూత్రాలు దోహదపడతాయని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో విజయం సాధించిన విద్యార్థులందరూ నైతిక విలువలు, క్రమశిక్షణతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం ద్వారా ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ జంపాల మాట్లాడుతూ శిక్షణా ఉపాధి విభాగ అధికారి కావూరి శ్రీధర్ వివిధ సంస్థల్లో ఎంపికైన డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థుల వివరాలను ప్రకటించడంతో పాటు మరిన్ని మెరుగైన ఫలితాల కొరకు భవిష్యత్తు కార్యాచరణ గురించి వివరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

చేపమందు వేస్తున్న దృశ్యం

చేప మందు పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఉబ్బసం దగ్గు శ్వాసకోశ వ్యాధులకు మృగశిరకార్తె ప్రవేశం సందర్భంగా జూన్ 8వ తేదీ శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఉచితంగా చేప మందును పంపిణీ చేశారు. జనాబ్ హాజి హకీమ్ మొహమ్మద్ యూసఫ్ అలి వారి మనుమలు మొహమ్మద్ మసూద్ అలి జిన్నా, మొహమ్మద్ మహమూద్ అలీలు ఈ చేప మందును శనివారం ఉదయం నుండి పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం ఉచితంగా చేప మందును వారి మనుమలు మొహమ్మద్ మసూద్ అలీ జిన్నా మరియు మహమ్మద్ మహమూద్ అలీలు చేపమందును ఆస్తమా వ్యాధి గ్రస్తులకు పంపిణీ చేశారు. చేప ముందు వేయించుకున్న వారు మూడు సార్లు తగ్గకుండా సంవత్సరానికి ఒకసారి చొప్పున, మూడు సంవత్సరాలు, వేయించుకోవాలని తెలిపారు. వనమూలికల తో తయారు చేసిన మందును చేపకు పెట్టి మింగించామని, చేపతో వేసుకొని వారికి, శాఖహారులకు మందు అనుపానముతో ఇచ్చామని తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, ఖమ్మం, కోదాడ, తూర్పు, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల నుండి ఆస్తమా వ్యాధిగ్రస్తులు వచ్చి ఈ చేప మందును వేయించుకున్నట్టు తెలిపారు. చేప మందు వేయించుకున్న వారు జున్నుపాలు వాలగ చేప, బూడిద గుమ్మడికాయ, వంకాయ, గోంగూర నీ దీర్ఘకాలం వాడకూడదని తెలిపారు.

అమ్రిత సాయిలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - కంచికచర్ల : ప్రస్తుత పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో ఇంజనీర్ పాత్ర చాలా కీలకంగా ఉందని జెఎన్టీయూ కాకినాడ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జివిఆర్ ప్రసాదరాజు అన్నారు. కంచికచర్ల మండలం పరిటాల పరిధిలో గల అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మూడో అటానమస్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్రిత సాయి కళాశాల యూనివర్సిటీ స్థాయిలో ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్లుగా అకడమిక్ కర్రికలమ్ నిర్వహిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల ప్రెసిడెంట్ కె.లక్ష్మీ కార్తీక్, సెక్రటరీ కరెస్పాండెంట్ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ 2020–24 అటానమస్ మూడో బ్యాచ్‌లో 454 మంది విద్యార్థులు ఇంజనీరింగ్ డిగ్రీ పట్టా పొందారని, వీరందరికి సర్టిఫికేట్స్ అందచేశామని తెలిపారు. ప్లేస్‌మెంట్స్‌లో 243 ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ ఆఫర్స్‌తో 12 లక్షల అత్యధిక వార్షిక వేతనంతో విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. విద్యార్థులకు మొదటి సంవత్సరం నుండే ఎల్ ఎమ్ ఎస్‌ఆన్ లైన్ ప్రోగ్రామింగ్ లాబ్స్ ద్వారా కెరీర్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం చేస్తున్నామన్నారు.

అంతేకాకుండా రాష్ట్రస్థాయిలో ఇండస్ట్రీ కొలాబరేషన్‌తో కళాశాలలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్డ్ లాబ్స్ ద్వారా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్.శశిధర్ మాట్లాడుతూ అమ్రిత సాయి విద్యార్థులు బి.టెక్ నాలుగేళ్ళ వ్యవధిలో మైనర్ డిగ్రీ కూడా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో 2020 –2024 బ్యాచ్‌కు సంబంధించిన కాలేజీ టాపర్ సి.యస్.ఈ బ్రాంచ్ ఎం.మృదులతో పాటు, 9 మంది బ్రాంచ్ టాపర్స్‌కు కళాశాల నుంచి గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.